సాక్షి
అనంతపురం

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



టన్ను చీనీ రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి



మహిళలకు ఆర్థిక దన్ను

'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' పేరుతో తపాలా శాఖ మహిళల కోసం సరికొత్త స్కీం ప్రవేశపెట్టింది.

IIలో

గరిష్టం/కనిష్టం
42.1°/23.7°

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పోలీసుల్లో సమన్వయానికి 'కాఫీ విత్ మెన్'



అనంతపురం శ్రీకంఠం సర్కిల్: పోలీసు అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కోసం అనంతపురం రేంజ్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో వారంలో ఒకరోజు 'కాఫీ విత్ మెన్' కార్యక్రమానికి డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పోలీస్ స్టేషన్ల సిబ్బంది - సచివాలయాల మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని 'పోలీసింగ్'లో అభివృద్ధి సాధించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. శనివారం లేదా ఆదివారం ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్లు 'కాఫీ విత్ మెన్' నిర్వహించాలని డీఐజీ సూచించారు. గడిచిన వారం రోజుల్లో అందించిన సేవలు.. తీసుకున్న చర్యలు.. రాబోయే వారంలో ఇంతకు మించి మెరుగ్గా తీసుకోవలసిన పోలీసు చర్యలపై చర్చించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ వల్ల పోలీసు స్టేషన్లలో మంచి వాతావరణం ఏర్పడి, సిబ్బంది మధ్య సమన్వయం పెరగడంతో పాటు హోదాలు మరచి అందరూ సమష్టిగా పనిచేసే అవకాశం కలుగుతుందని.. తద్వారా పోలీసులకు మెరుగైన సేవలందించవచ్చని తెలిపారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు




మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి

కళ్యాణదుర్గం/ అనంతపురం అర్బన్: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, కలెక్టర్ ఎం.గౌతమి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవాభావం పెంపొందించుకోవాలని, సోదర భావంతో మెలగాలని సూచించారు. ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

బడుగు వికాసానికి దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం టౌన్: ఎస్సీ, ఎస్టీ యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలతో 'జగనన్న బడుగు వికాసం' పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు తెలిపారు. ఈ పథకానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యూనిట్లు స్థాపించే పారిశ్రామికవేత్తలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఈ ఏడాది 45 శాతానికి పైగా ప్రత్యేక రాయితీలను ప్రభుత్వం అందిస్తున్నట్లు వెల్లడించారు. సేవా రంగంతోపాటు పారిశ్రామిక రంగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు పరిశ్రమల శాఖ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

వేసవి సెలవులు 8 రోజులే



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) క్యాంపస్‌కు వేసవి సెలవులు 8 రోజులు నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మే 13 నుంచి 21 వరకు మాత్రమే వేసవి సెలవులు ఉంటాయి. పీజీ రెండు, నాలుగో సెమిస్టర్ ఏప్రిల్ 24 నుంచి ప్రారంభం కానుంది. జూన్ 12 నుంచి 16 వరకు మిడ్-1 ఇంటర్నల్ పరీక్షలు జరుగుతాయి. జూలై 24 నుంచి 28 వరకు మిడ్ -రెండో ఇంటర్నల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు 16న పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు జరిగేలా షెడ్యూల్ ఖరారు చేశారు.

పరిశోధన.. వేదన



ఎస్కే యూనివర్సిటీ పాలక భవనం

- రీసెర్చ్ మార్గదర్శకాలకు ఎస్కేయూ తిలోదకాలు
- గైడ్‌లుగా రిటైర్డు ప్రొఫెసర్లు
- ఆ డాక్టరేట్లు చెల్లుబాటు కావంటూ విద్యార్థుల ఆందోళన



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పరిశోధన మార్గదర్శకాలకు తిలోదకాలు ఇచ్చారు. పీహెచ్‌డీ కోర్సు విధివిధానాలు, మార్గదర్శకాలు 2019లో రూపకల్పన చేశారు. అప్పటి నుంచి ఇవే విధానాలు అమలవుతున్నాయి. అనంతపురం జేఎన్‌టీయూతో పోల్చితే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సైన్స్ విభాగాల్లో మంజూరు చేసే డాక్టరేట్లకు విశ్వసనీయత అధికంగా ఉంటుందని పరిశోధన విద్యార్థుల భావన. అయితే తాజాగా నిబంధనలు విస్మరిస్తూ ఇష్టానుసారంగా నిర్ణయాలు అమలు చేస్తున్నారు. అర్హత లేని వారిని పరిశోధన గైడ్‌లుగా నియమిస్తున్నారు. ఇలాంటి వారు జారీ చేసే పీహెచ్‌డీ అవార్డులు చెల్లుబాటు కావనే అంశం పరిశోధన విద్యార్థుల్లో ఆందోళనకు కారణమైంది.

నిబంధనలకు విరుద్ధంగా రీసెర్చ్ గైడ్‌ల నియామకం

ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగ విరమణ చేయడానికి రెండేళ్ల ముందు నుంచి పీహెచ్‌డీ అడ్మిషన్లు వీరి కింద చేయడానికి వీల్లేదు. తాజాగా ఈ నిబంధనను మూడు సంవత్సరాలకు పెంచారు. అయినప్పటికీ ఉద్యోగ విరమణ చేసిన ప్రొఫెసర్లే రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తున్నారు. మార్గదర్శకాల ప్రకారం రిటైర్డు ప్రొఫెసర్ల కింద పరిశోధన చేస్తున్న విద్యార్థులను తక్షణమే ఇతర ప్రొఫెసర్ల కిందకు మార్పు చేయాలి. కానీ ఇక్కడ భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రిటైర్డు అయిన వారి కిందే పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. సింహభాగం సైన్స్ విభాగాల్లో, ఆర్ట్స్ విభాగాల్లోనూ ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. వీరి నేతృత్వంలో పరిశోధన చేసి పీహెచ్‌డీ అవార్డు అయితే చెల్లుబాటు కాదని 2019 పరిశోధన మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి.

బదలాయింపులో జాప్యమేల?

విశ్రాంత ప్రొఫెసర్ల నేతృత్వంలో పరిశోధన చేస్తున్న విద్యార్థులను అదే విభాగంలోని మరో ప్రొఫెసర్‌కు బదలాయింపు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ అదే విభాగంలో ఫ్యాకల్టీ లేకపోతే అర్హులైన డిగ్రీ కళాశాల లెక్చరర్లకు కో గైడ్‌గా అవకాశం కల్పించాలి. ఇవన్నీ పట్టించుకోకుండా విద్యార్థుల భవితకు విఘాతం కలిగేలా యూనివర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పరిశీలిస్తున్నాం



విశ్రాంత ప్రొఫెసర్ల నేతృత్వంలో ఎంత మంది విద్యార్థులు పరిశోధన చేస్తున్నారనే వివరాలు పరిశీలిస్తున్నాం. ఇదివరకే వీసీ దృష్టికి తీసుకెళ్లాం. నిబంధనలు విస్మరించకుండా పరిశోధన విద్యార్థుల బదలాయింపు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రొఫెసర్ కృష్ణకుమారి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, ఎస్కేయూ

అధికారుల వైఖరి సరికాదు



పరిశోధన మార్గదర్శకాలు-2019ను పాటించడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒక పరిశోధన విద్యార్థి నష్టపోయినా అందుకు యూనివర్సిటీ అధికారులంతా బాధ్యత వహించాల్సి ఉంటుంది. అనర్హులను గైడ్‌గా నియమించి విద్యార్థులను ఇబ్బందిపెడుతున్న వర్సిటీ అధికారుల వైఖరి సరికాదు.

– హేమంత్ కుమార్, వైఎస్సార్ విద్యార్థి విభాగం, ఎస్కేయూ

సేవలతోనే ప్రజా మన్ననలు



ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, అధికారులు

అనంతపురం అర్బన్: నిజాయితీ, నిబద్ధతతో సేవలందించినపుడే ప్రజల నుంచి మన్ననలు పొందుతారని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో 16వ పౌర సేవల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఎఫ్‌ఓ సందీప్ కృపాకర్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, డీఆర్‌ఓ గాయత్రీదేవి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సివిల్ సర్వీసెస్‌డే బ్యానర్‌పై అధికారులు సంతకాలు చేశారు. ఆ తరువాత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ డే అనేది కేవలం ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌లకు సంబంధించినది కాదన్నారు. ప్రజలకు సేవ చేసే ప్రతి ఒక్క అధికారీ ప్రజా సేవకులే అన్నారు. ప్రభుత్వపరంగా అందించాల్సిన సేవలను నిజాయితీ, నిబద్ధత, మానవత్వంతో అందించినప్పుడే ఉద్యోగుల గౌరవం పెరుగుతుందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. నిజాయితీతో సేవలందిస్తామని అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. బిందు సేద్యంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్‌ను పౌర సేవల దినోత్సవం సందర్భంగా కలెక్టర్, అధికారులు సన్మానించారు.

కాలవ దోపిడీకి అడ్డా ఎన్.హనుమాపురమే

- ఇసుక డంప్‌చేసి బెంగళూరుకు తరలించింది ఇక్కడి నుంచే..
- రూ.360 కోట్లు కూడగట్టినట్టు 'పచ్చ' పత్రికే వెల్లడించింది
- కాలవ దోపిడీలకు పాల్పడితే..మేం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశాం
- విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు... చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, పైలా, పామిడి వీరా

రాయదుర్గం: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్నప్పుడు కణేకల్లు మండలం ఎస్.హనుమాపురాన్ని అడ్డాగా మార్చుకుని పలు కంత్రీ పనులు చేశారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆయన శుక్రవారం ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు, రాయదుర్గం మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజు నాయక్‌తో కలసి ఎన్.హనుమాపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు పైనేటి తిమ్మప్ప స్వగృహం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎన్.హనుమాపురంలో ఇసుక డంప్ చేసి.. ఇక్కడి నుంచి బెంగళూరుకు తరలించి రూ.కోట్లు కొల్లగొట్టిన నీచ సంస్కృతి కాలవదని మండిపడ్డారు. ఈ విషయం కాలవ ఎవరికైతే బ్రోకర్ పనిచేశాడో, ఆ రాజగురువు పత్రిక 'ఈనాడు' లోనే 'మంత్రి ఇలాకాలో కంత్రీల కులాసా' శీర్షికతో ప్రచురితమైందని గుర్తుచేశారు. వారు చూపిన లెక్కల ప్రకారమే ఒక్క ఇసుకలోనే రూ.360 కోట్లు దోపిడీ చేశాడంటే, మిగిలిన వాటితో కలిపి ఏ స్థాయిలో ప్రజాధనం కొల్లగొట్టి ఉంటాడో అర్థం చేసుకోవచ్చునన్నారు. కాలవ ప్రజాధనం, సహజ వనరుల దోపిడీనే అజెండాగా మార్చుకుంటే..తాము మాత్రం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నామన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఒక్క హనుమాపురానికే ఈ నాలుగేళ్లలోనే రూ. 9.26 కోట్లు ఖర్చుచేశామన్నారు. మిగిలిన ఏడాది కాలంలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

దొడ్డిదారినొచ్చి హంగామా చేస్తావా?

ప్రతి అమావాస్యకు గుడికెళ్లే అలవాటు తనకు ఉందని, దీన్ని ముందే పసిగట్టిన కాలవ ఎన్. హనుమాపురానికి దొడ్డిదారిన చేరుకుని పచ్చ మూకలతో కలసి హంగామా సృష్టించాడని విప్ కాపు విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. 'కాలవకు నేను మళ్లీ మళ్లీ చెప్పేది ఒక్కటే. యుద్ధానికి రమ్మనం లేదు. వాదోపవాదాలు అసలే వద్దు. వేదికలెక్కి మైకులతో చర్చలకూ రమ్మని పిలవలేదు. నీ ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎన్.హనుమాపురంలో ఇంటింటికీ ఏం చేశావ్? గ్రామంలో చేసిన అభివృద్ధి ఏంటో లెక్కలు తీసుకుని రమ్మంటున్నా. ఈ నాలుగేళ్లలో మేము చేసిన అభివృద్ధిపై ప్రత్యేక నివేదికతో వస్తామ'ని అన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ కాలవ వాల్మీకుల ద్రోహి అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి బలం లేకపోయినా వాల్మీకి మహిళ అయిన తనపై కావాలనే అభ్యర్థిని నిలిపిన దుర్మార్గుడు కాలవ అని ధ్వజమెత్తారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ సామరస్యంగా చర్చకు రమ్మని కాపు పిలిస్తే రచ్చ చేసేలా కాలవ వ్యవహరించడం నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ఎస్.హనుమాపురంలో ఆయన ఆడిన డ్రామాకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చన్నారు. పామిడి వీరాంజినేయులు మాట్లాడుతూ పాదయాత్ర చేస్తున్న లోకేష్ కూడా కాలవ లాగే వ్యవహరిస్తూ అల్లర్లు సృష్టిస్తున్నాడని ఆరోపించారు.

నేడు ఈద్ ఉల్ ఫితర్



విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్న జంగాలపల్లి మసీదు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముస్లింల అత్యంత పవిత్రమైన పండుగ రంజాన్. నెల రోజుల కఠిన నియమాలు, ఉపవాస దీక్షలు విజయవంతంగా పూర్తి చేశారు. నెలవంక దర్శనంతో శనివారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్)ను జరుపుకోనున్నారు. నెలపాటు ఆచరించిన నమాజులు, ఉపవాసాలు, చేసిన పుణ్యకార్యాలకు సంబంధించి రంజాన్ రోజున అల్లా బహుమతి అందిస్తారని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మసీదుల్లో ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు వివిధ సమయాల్లో నమాజు నిర్వహించేలా మత పెద్దలు నిర్దేశించారు.

'గురుకుల'ంలో ప్రవేశాలకు రేపు ప్రవేశ పరీక్ష

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు) 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 23న రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 5వ తరగతిలో ఒక్కో సీటు కోసం 8 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండు సీట్లకు ఏడుగురు విద్యార్థులు పోటీ పడుతున్నారు. వివరాలను గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాలాజీనాయక్ శుక్రవారం వెల్లడించారు. 5వ తరగతిలో 1,200 సీట్లకు 10,033 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంటర్‌లో 1,120 సీట్లకు గాను 4,228 దరఖాస్తులు వచ్చాయన్నారు. పరీక్ష నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశామన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ జిరాక్స్, బ్లూ/బ్లాక్ బాల్‌పెన్ తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 91604 12551, 98856 50052, 99595 59400 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దొంగల కదలికలపై ఏదీ నిఘా?

- ఉమ్మడి జిల్లాలో 2,957 మంది దొంగలు
- వీరిలో గజ దొంగలు 70 మంది
- ఏడేళ్లుగా కొరవడిన పోలీసుల నిఘా
- ఇదే అదనుగా పేట్రేగిపోతున్న దొంగలు
- విధుల్లో వేగం తగ్గించిన సీసీఎస్



అనంతపురం సీసీఎస్ పోలీసుస్టేషన్

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: ఇళ్లల్లో చోరీలు చేయడం.. మనుషుల్ని ఏమార్చి నగలు, నగదు, విలువైన వస్తువులు తస్కరించడం.. బ్యాంకులు, దుకాణాలకు కన్నం వేయడం వంటి కేసులను ఇదివరకు పోలీసులు ఎంతో సీరియస్‌గా తీసుకునేవారు. ఏ తరహా చోరీ అయితే ఆ తరహా దొంగలను ఇట్టే గుర్తించేవారు. ఆ స్థాయిలో దొంగల కదలికలపై నిఘా ఉండేది. 2018 నుంచి 2020 వరకు చోరీ సొత్తు రికవరీలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సీసీఎస్ (నేర పరిశోధన కేంద్రం) నిలిచింది. అంతటి ఖ్యాతిగడించిన పోలీసుల్లో ఎందుకో నిర్లిప్తత మొదలైంది. క్రమేణా దొంగల కదలికలపై నిఘా పెట్టడం మానేశారు. ఇదే అదనుగా భావించిన దొంగలు పేట్రేగిపోతున్నారు. అయినా పోలీసులు తమ కేమీ పట్టనట్టు నిమ్మకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.

2,957 మంది దొంగలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2,957 మంది దొంగలు ఉన్నట్లు 2015-16లో పోలీసు శాఖ గుర్తించింది. ఇందులో గజ దొంగలు 70 మంది దాకా ఉన్నారు. వీరు ఎటువంటి దొంగతనాలు చేశారు.. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ని.. మొత్తం ఎన్ని కేసుల్లో నిందితులుగా ఉన్నారు వంటి పూర్తి వివరాలు సేకరించింది. దొంగల బంధువులు, స్నేహితులు, ఆర్థిక మూలాలను గుర్తించేలా ప్రణాళికను రూపొందించింది.

అటకెక్కిన 'ఒక దొంగ – ఒక పోలీస్'

చోరీలు చేసే విధానం, నేరంలో తీవ్రతను బట్టి ఆ స్థాయి పోలీసు అధికారికి సదరు దొంగ బాధ్యతలను అప్పగించారు. ఏడేళ్ల కిందట 'ఒక దొంగ – ఒక పోలీస్' కార్యక్రమం చేపట్టారు. సదరు దొంగ ఊరు వెళ్లాల్సి వస్తే.. అతనికి కేటాయించిన పోలీసుకు సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలి. ఎక్కడైనా చోరీ జరిగితే.. దాని తీవ్రతను బట్టి ఎవరు చేసి ఉంటారో ఒక అంచనాకు వచ్చి సదరు దొంగలను స్టేషన్‌కు పిలిపించి ఆరా తీసేవారు. చోరీకి పాల్పడింది జిల్లాకు చెందిన వారా.. బయటి వారా అనే విషయంపై స్పష్టత వచ్చి.. దర్యాప్తు వేగవంతమయ్యేది.

స్పీడు తగ్గించిన సీసీఎస్..

నేర పరిశోధన కేంద్రం (సీసీఎస్) పోలీసులు ఎందుకో స్పీడు తగ్గించారు. రాష్ట్రస్థాయిలో సుమారు 13 కిలోల బంగారు నగలు రికవరీ చేసిన ఘనత సాధించిన టీమ్ ప్రస్తుతం సీసీఎస్ స్టేషన్‌కే పరిమితమైంది. మూడేళ్లుగా స్తబ్దుగా ఉండిపోయింది. మంచి నైపుణ్యం కలిగిన సిబ్బంది ఉండి కూడా అడుగు ముందుకు వేయలేకపోతోంది. దీంతో చోరీల నియంత్రణేకాదు...రికవరీలపై కూడా ఆ ప్రభావం పడుతోంది. జిల్లా కేంద్రం అనంతపురంలోనే వరుసగా చోరీలు, బస్సుల్లో ప్రయాణికులను ఏమార్చి బంగారం, నగదు, విలువైన వస్తువులతో ఉడాయించిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటిదాకా ఈ కేసుల్లో పోలీసులు కనీస పురోగతి సాధించలేక పోయారు. ఇలాంటివి జిల్లాలో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రత్యేక కౌన్సెలింగ్ అవసరమే

వేసవి ప్రారంభమైంది. రాత్రిపూట ఉక్కపోత భరించలేక చాలామంది ఆరుబయట, మిద్దెల మీద నిద్రిస్తుంటారు. దొంగలు చేతివాటం ప్రదర్శించేందుకు అనువైన కాలం కూడా ఇదే. కాగా పోలీసు ఉన్నతాధికారులు చోరీలను నియంత్రించేందుకు దొంగలకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తే మంచి ఫలితాలు ఉంటాయని జిల్లావాసులు కోరుతున్నారు.

జిల్లాలో 2022 సంవత్సరంలో చోరీలు..

నేర రకం	కేసులు
రాబరీలు	7
ఇళ్లల్లో పగటి దొంగతనాలు	70
ఇళ్లల్లో రాత్రి దొంగతనాలు	114
సాధారణ చోరీలు	398
మనిషిని ఏమార్చి అపహరణ	1
2023 సంవత్సరంలో ఇప్పటి వరకు దాదాపు	110

క్లుప్తంగా

స్కూల్ బస్సుకింద పడి బాలుడి మృతి

- చాపిరి గ్రామంలో విషాదం



విహాన్ మృతదేహం వద్ద కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

కళ్యాణదుర్గం: స్కూల్ బస్సు దూసుకెళ్లడతో ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు.. మండలంలోని చాపిరి గ్రామానికి చెందిన మధు, వాణీ దంపతులకు ఒక్కగానొక్క సంతానం అయిన విహాన్ (5) కళ్యాణదుర్గం జ్ఞానభారతి పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం విహాన్ పాఠశాల నుంచి బస్సులో చాపిరి గ్రామానికి వచ్చాడు. బస్సుదిగి ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ బస్సు వెనుక చక్రాల కింద పడ్డాడు. స్కూల్ బస్సు డ్రైవర్ గమనించకుండా ముందుకు వెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో విహాన్ బస్సు టైరు కింద పడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు స్కూల్ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారం అందించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లితండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

మహిళలకు ఆర్థిక దన్ను

మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తపాలాశాఖ ఉనికి చాటుకునేందుకు ప్రయత్నిస్తోంది. వివిధ వర్గాల వారిని ఆకట్టుకునేలా రకరకాల పథకాలను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా అమ్మాయిలు, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' అనే సరికొత్త స్కీం అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే ప్రచారంలో తపాలాశాఖ అధికారులు వెనుకబడ్డారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మగువల మనసు దోచేలా తపాలాశాఖ సరికొత్త పథకం
- 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్'తో అన్ని విధాలా అండ
- రూ.1000 నుంచి రూ.2 లక్షల దాకా డిపాజిట్‌కు అవకాశం





అనంతపురం సిటీ: తపాలాశాఖ 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' అనే కొత్త స్కీం అమల్లోకి తెచ్చింది. అప్పుడే పుట్టిన వారు మొదలు మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రత్యేకంగా చేర్చారు.

వన్‌టైం సేవింగ్స్ స్కీం..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీం.. వన్ టైం సేవింగ్స్ స్కీం. ఇది 2025 మార్చి 31 వరకు మాత్రమే అమలులో ఉంటుందని తపాలాశాఖ ప్రకటించింది. ఈ స్కీంలో చేరే అమ్మాయిలు, మహిళలు కనిష్ఠ పెట్టుబడి రూ.1000 మొదలుకొని రూ.2 లక్షల వరకు డిపాజిట్ చెయ్యొచ్చు. గరిష్ఠ మొత్తానికి (రూ.2 లక్షలు) లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశాన్ని కూడా కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉన్నట్లయితే కనీసం మూడు నెలల టైం గ్యాప్‌తో మళ్లీ ఖాతా తెరచుకోవచ్చు. ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తరువాత మెచ్యూరిటీ కింద డబ్బు డ్రా చేసుకోవచ్చు. అయితే వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. అయితే ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు.

ఏడాది తరువాత ఏం చేయొచ్చంటే..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తరువాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకునే వీలు కూడా ఉంది. ఏ కారణాలతో అయినా డిపాజిటర్ మరణించినా లేదా కారుణ్యం కింద ఖాతా మూసివేసుకోవచ్చు. 2 శాతం తగ్గిన వడ్డీతో ఆరు నెలల తరువాత ఎప్పుడైనా ఖాతాను మూసివేయవచ్చు.

కట్టిన మొత్తానికి రెండేళ్ల తర్వాత వచ్చేదిలా..	
కట్టిన మొత్తం	చేతికందే మొత్తం
రూ.1,000	రూ.1154
రూ.10,000	రూ.11,542
రూ.50,000	రూ.57,714
రూ.1,00000	రూ.1,15,428
రూ.2,00000	రూ.2,30,854

కావాల్సిన పత్రాలు..

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీంలో చేరాలంటే ఆధార్ కార్డు, పాన్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు. వీటిని తీసుకొని సమీపంలోని సబ్ పోస్టాఫీస్ లేదా బ్రాంచ్ పోస్టాఫీస్‌కు వెళ్లి ఖాతా తెరవవచ్చు.

ప్రచారం లేక.. స్పందన రాక..

కొత్తగా ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీంకు సంబంధించి పట్టణ ప్రాంతాల నుంచి కొంత వరకు స్పందన వస్తోందని తపాలాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి ఎవరూ ముందుకు రావడం లేదని వారే అంగీకరిస్తున్నారు. దీతో విస్తృత ప్రచారం కల్పించడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం



మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ గురించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు అన్ని శాఖల అధికారుల సహకారం తీసుకుంటున్నాం. దీనికి తోడు కరపత్రాలు, గోడ పత్రికలను సైతం గ్రామీణ ప్రాంతాల్లోని మా సిబ్బందికి అందజేశాం. స్కీం ప్రయోజనాలు వివరించి, ప్రజల్లో అవగాహన పెంపొందించి వారితో ఖాతాలు తెరిపించాలని ఆదేశించాం.

– బాలసత్యనారాయణ, తపాలాశాఖ సూపరింటెండెంట్, అనంతపురం

ఎస్పీ సుడిగాలి పర్యటన

తాడిపత్రి: నియోజకవర్గంలోని పలు మండలాల పోలీస్‌స్టేషన్లతో పాటు శింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు మండలంలో అనంతపురం ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్, వీరాపురం గ్రామంలోని పోలీస్ పికెట్, పెద్దపప్పూరు మండలంలోని పోలీస్ స్టేషన్, జూటూరు గ్రామంలోని పోలీస్ పికెట్, పుట్లూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లను పరిశీలించారు. ఎక్కడా ఆయన మీడియా కంటపడకుండానే పర్యటనను పూర్తి చేసుకోవడం గమనార్హం.

ఆర్టీసీ డ్రైవర్‌పై తాగుబోతుల దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక గుత్తిరోడ్డులో రాయదుర్గం ఆర్టీసీ బస్సు డ్రైవరు నాగరాజుపై తాగుబోతులు దాడి చేశారు. బస్సు ముందు అద్దం పగులగొట్టి అడ్డుకోబోయిన డ్రైవరును కిందకు తోసి ఇష్టానుసారం కొట్టారు. తీవ్రంగా గాయపడిన నాగరాజు స్థానిక త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు డ్రైవర్ నాగరాజును చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు రాయదుర్గానికి ప్రయాణికులతో వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఆర్టీసీ అధికారులు స్పందించి మరో బస్సును ఆ రూటుకు పంపి ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చూశారు. ఇదిలా ఉండగా డ్రైవర్‌పై దాడి చేసిన అల్లరి మూకల కోసం త్రీటౌన్ పోలీసులు గాలిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తి సమీపంలోని కెనాల్ కాలువ కాలువ పక్కన ముళ్ల పొదల్లో శుక్రవారం పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,02,300తో పాటు 6 ద్విచక్ర వాహనాలు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో రెండు బృందాలుగా ఏర్పడి చాకచక్యంగా దాడులు చేసి 8 మంది అరెస్ట్ చేశామన్నారు. కొంత మంది పారిపోయారని ఎస్‌ఐ తెలిపారు.

బడుగులకు ఏం చేశారో చెప్పండి?

- ఓటు బ్యాంకుగా వాడుకుంది నిజం కాదా?
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని విధాలా అండ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: 'వెనుకబడిన కులాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను గత టీడీపీ ప్రభుత్వం ఓటు బ్యాంకుగా వాడుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగులు అన్ని విధాల అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారు. వారి ఆత్మగౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు అందరూ రుణపడి ఉంటారు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. ఇటీవల మాజీ సీఎం చంద్రబాబు, టీడీపీ నేత లోకేష్ బడుగులకు సముచిత స్థానం కల్పించలేదని చేస్తున్న విషప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈమేరకు శుక్రవారం యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న తదితరులతో కలసి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పైలా మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేబినెట్, నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం, నలుగురిని రాజ్యసభకు పంపిన విషయాన్ని పైలా గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం బడుగులకు ఏం చేసిందో చెప్పాలన్నారు. ఎన్నికలు రానున్న తరుణంలో టీడీపీ చేస్తున్న విషప్రచారాని తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి, నామినేటెడ్ పోస్టులు, దేవాలయాల కమిటీల్లో కల్పిస్తున్న ప్రాధాన్యతను జీర్ణించుకోలేక టీడీపీ విషప్రచారానికి తెరలేపిందన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు ఎన్ని బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, చట్టసభల్లో ఎంత మంది బీసీలకు అవకాశం కల్పించారో చెప్పాలని లోకేష్‌ను ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని బీసీల జపం చేయడం తగదన్నారు. విజయవాడలోని బీసీ భవన్‌లో 56 కార్పొరేషన్లకు కార్యాలయాలు ఉన్నాయన్నారు. కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లకు గౌరవ వేతనం విధిగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు శ్రీనివాసులు, రాఘవేంద్ర, అల్లీపీరా, నాయకులు నవీన్, నాగేంద్ర, పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీపై అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: సాగు పెట్టుబడి తగ్గించే క్రమంలో నానో యూరియా, డీఏపీలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వీటి వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండలి చైర్మన్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, సూక్ష్మధాతువులు, జిప్సం, పత్తి, మిరప, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పంటల బీమాకు సంబంధించి నగదు రైతు ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండు మిరపలో నల్లతామర పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ పంట రుణాల మంజూరుకు బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, దీన్ని దృషిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించేలా ముందస్తుగా పంటల ప్రణాళిక సిద్ధం చేసుకుని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ-పంట నమోదు పక్కాగా నిర్వహించి మద్దతు ధరతో పంటల కొనుగోలు, నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, జేడీఏ చంద్రానాయక్, ఇతర అధికారులు, మండలి డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు అధిగమించాలి

అనంతపురం అర్బన్: ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుంచి మండల, మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వేసవిలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టా, పొజిషన్ సర్టిఫికెట్ల అప్‌డేషన్ కోసం 25,114 మంది లబ్ధిదారుల జాబితాలో 11,311 మందిని అప్‌డేట్ చేశారన్నారు. మిగిలిన వారిని వెంటనే అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 13,167 మంది లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ అందజేసేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సంబంధిత తహసీల్దారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

రోకలితో భార్యను కడతేర్చిన భర్త



భార్యను హత్యచేసి మృతదేహం పక్కనే కూర్చొని ఉన్న భర్త ఓబుల్‌రెడ్డి

తాడిపత్రి: రోకలితో కొట్టి కట్టుకున్న భార్యనే కడతేర్చాడో భర్త. మండలంలోని వెలంకూరులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ వివరాల మేరకు... వెలంకూరుకు చెందిన ఓబుల్‌రెడ్డి, నారాయణమ్మ (75) దంపతులకు ఇరువురు కుమార్తె. వారికి వివాహమై ఒకరు తాడిపత్రి పట్టణంలో, మరొకరు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నివాసం ఉంటున్నారు. వృద్ధదంపతులైన వీరు వారి కుమార్తెల వద్ద చెరొకరు ఉంటున్నారు. శుక్రవారం ఉదయం వారి కుమార్తెల వద్ద నుంచి ఇరువురు స్వగ్రామానికి చేరుకున్నారు. ఎన్నాళ్లు మనం ఇలా కుమార్తెల ఇండ్ల వద్ద ఉంటాం అన్న చర్చ వారిద్దరి మధ్య జరిగింది. మాటా మాటా పెరగడంతో క్షణికావేశంలో ఓబుల్‌రెడ్డి రోకలితో భార్య నారాయణమ్మ తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నారాయణమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బ్యాటరీల దొంగల ముఠా అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో ఎయిర్‌టెల్ సెల్‌టవర్‌కు సంబంధించిన బ్యాటరీలు ఈనెల 17న చోరీకి గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం బ్యాటరీ ముఠాను అరెస్టు చేసినట్లు రాయదుర్గం రూరల్ సీఐ యుగేంధర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉరవకొండకు చెందిన కిరణ్‌బాబు, చందా హరీష్, ఆంజినేయులు, పవన్‌కుమార్ కలిసి ఈనెల 17న రాత్రి బొలేరో వాహనం తీసుకొచ్చి 24 బ్యాటరీలను అపహరించుకొని వెళ్లారని తెలిపారు. శుక్రవారం ఉదయం బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ మండలంలోని గోవిందవాడ క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండా రూ. 3.75 లక్షల విలువ గల 24 బ్యాటరీలు బొలెరో వాహనంలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. బొలెరో వాహనంతో పాటు కిరణ్‌బాబుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

హత్యాయత్నం ఘటనపై కేసు నమోదు

తాడిపత్రి: మండల పరిధిలోని బొందలదిన్నెలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం సెక్రటరీ హరినారాయణరెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం హరినారాయణరెడ్డి వెళ్తున్న కారును గుర్తుతెలియని వ్యక్తి క్యాంపర్ వాహనం నడుపుతూ వచ్చి హరినారాయణ కారును ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. హరినారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కడప జిల్లా కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరుకు చెందిన మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి, అతడి వర్గీయులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి: గుత్తి జీఆర్‌పీ పరిధిలోని చెరువు తండా గ్రామ సమీపంలో శుక్రవారం రైలు కింద పడి శంకర్‌నాయక్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చిదరగుట్ట తండాకు చెందిన శంకర్ నాయక్ అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య



జయకృష్ణ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: తల్లిదండ్రులు మందలించారన్న నెపంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెంకటంపల్లిలో చోటు చేసుకుంది. తల్లిదండ్రులు, పోలీసుల వివరాల మేరకు... మండలంలోని వెంకటంపల్లికి చెందిన కంసలి సుబ్రమణ్యం, సుధా దంపతుల కుమారుడు జయకృష్ణ (23) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. జయకృష్ణ ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత చదువు మానేశాడు. తల్లిదండ్రులు అప్పు చేసి ఆటో కొనిచ్చారు. ఆటో తోలుకుంటూ బతుకుతున్న జయకృష్ణ కొన్ని రోజులుగా ఆటో సక్రమంగా తోలకుండా ఆటోఫైనాన్స్ కంతులు చెల్లించలేదు. దీంతో కుమారుడిని గురువారం రాత్రి తల్లిదండ్రులు మందలించారు. తల్లిదండ్రులు రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటి బయట పడుకున్నాడు. ఇంటిలో నిద్రించిన జయకృష్ణ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారిన తర్వాత గుర్తించిన తల్లిదండ్రులు ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతున్న కుమారున్ని కిందకు దింపగా అప్పటికే చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: భర్త వేధింపులు తాళలేక ఓ ఇల్లాలు ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎర్రనేల కొట్టాలకు చెందిన దూదేకుల అమీదా (32)ని 13 ఏళ్ల క్రితం ఎర్రనేల కొట్టాలకు చెందిన మహ్మద్ రఫీకి ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సాఫీగా సాగిపోతున్న వారి జీవితంలో మద్యం చిచ్చు పెట్టింది. పనిపాటలేకుండా జులాయిగా తిరిగే భర్త నిత్యం తాగుడుకు డబ్బు కావాలని భార్యను వేధించేవాడు. ఎర్రనేల కొట్టాలలో అమీద వలంటర్‌గా పని చేస్తున్నారు. వచ్చే డబ్బుతో కుటుంబాన్ని అతికష్టం మీద నడిపేది. బాధ్యతలను పంచుకోవాల్సిన భర్త డబ్బు కోసం నిత్యం వేధింపులకు దిగటాన్ని జీర్ణించుకోలేని అమీదా పెద్దమనుషుల సమక్షంలో రెండు రోజుల క్రితం పంచాయతీ పెట్టింది. పెద్దలు చెప్పిన మాటలను సైతం భర్త లెక్క చేయలేదు. దీంతో మనస్థాపం చెందిన భార్య శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ఉరితాడు నుంచి విడిపించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా అప్పటికే అమీదా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లారీడ్రైవర్‌పై కత్తితో దాడి.. నగదు అపహరణ

తాడిపత్రి: మండల పరిధిలోని అర్జాస్ స్టీల్‌ప్లాంట్ సమీపంలో తాడిపత్రి – కడప రహదారిపై లారీడ్రైవర్‌ను కత్తితో పొడిచి అతడి వద్ద ఉన్న నగదును దోచుకెళ్లిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. కడప జిల్లాకు చెందిన లారీడ్రైవర్ శివకృష్ణ ఆచారి మండలంలోని పెన్నా సిమెంట్ పరిశ్రమ నుంచి శుక్రవారం రాత్రి సిమెంట్ బస్తాల లోడ్‌తో కడపకు బయలుదేరాడు. అర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలోకి రాగానే బహిర్భూమికి వెళ్లేందుకు లారీని రహదారి పక్కన ఆ ఆపి కిందకు దిగాడు. అంతలోనే మోటార్ సైకిళ్లపై వచ్చిన నలుగురు దొంగలు కత్తిని చూపుతూ తన వద్ద ఉన్న నగదును ఇవ్వాలని బెదిరించారు. ప్రతిఘటనకు దిగిన శివకృష్ణ ఆచారి చేతిపై కత్తితో దాడి చేశారు. దీంతో అతడి వద్ద ఉన్న నగదు రూ. 6 వేలతో పాటు, మొబైల్ ఫోన్, లారీలోని వంట సామగ్రిని ఎత్తుకుని పారిపోయారు. శివకృష్ణను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇంటిపై నుంచి పడి బేల్దారి మృతి

గుంతకల్లు రూరల్: పట్టణంలోని పాత గుంతకల్లుకు చెందిన బేల్దారి ఉడుదాల రమేష్ (41) ఎస్కేపీ కళాశాల వెనుక భాగాన నిర్మిస్తున్న ఒక ఇంటి నిర్మాణ పనులకు వెళ్లారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ నిర్మాణంలో ఉన్న ఇంటిపై నుంచి పడిపోవడంతో చనిపోయారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్లుప్తంగా

30న వాసవీ జయంతి వేడుకలు



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఈనెల 30న వాసవి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పాతూరు కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ ప్రతినిధులు పిన్ని నాగరత్నం, తిరువీధుల జగదీష్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో వాసవీజయంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం శోభాయాత్ర ఉంటుందని, ప్రత్యేకంగా కాంతారా నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రూసా నిబంధనలు పారదర్శకంగా ఉండాలి

రాప్తాడురూరల్: రూసా నిబంధనలు పారదర్శకంగా రూపొందించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

సామాజిక స్పృహతోనే రాణింపు



జేఎన్టీయూఏ రిజిస్ట్రార్ శశిధర్‌ను సన్మానిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

అనంతపురం: సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణించొచ్చని జేఎన్టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ అన్నారు.శుక్రవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిప్లొమో కోర్సుతో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా జిల్లాలో భారీ తరహా పరిశ్రమల స్థాపనతో డిప్లొమో పూర్తి చేసిన వారికి కొలువులు సులువుగా దక్కుతాయన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రిటైర్డ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ రామసుబ్బారావు, రంగనాయకులు , పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జగన్‌తోనే ముస్లింలకు న్యాయం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



రంజాన్ తోఫా అందిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏ నారాయణపురం పంచాయతీ పరిధిలోని మసీదులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అనంత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్లు ఇసాక్, నంపంగి రామాంజినేయులు, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతీ సాహితీ హాజరై, రంజాన్ తోఫా పంపిణీ చేశారు. నాయకులు మల్లెల వేణుగోపాల్, బి.మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు : వేసవిని దృష్టిని ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చడానికి ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం తపోవనంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

ఘనంగా రైపర్ కళాశాల వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: రాఘవేంద్ర ఫార్మసీ కళాశాల (రైపర్) 21 వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నైపర్, మొహలీ హెడ్ మెడిసినల్ కెమిస్ట్రీ డాక్టర్ ప్రసాద్ భరతయ్ హాజరై మాట్లాడారు. ఫార్మా రంగంలో విస్తృతమైన పరిశోధనలు చేసి దేశ సేవలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కెమో ఇండియా రెగ్యులేటరీ అఫైర్స్ జీఎం అజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మనాభ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవో బాధ్యతల స్వీకరణ

అనంతపురం కల్చరల్: మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ఈవోగా రమేష్‌బాబు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఈవోగా ఉన్న సుధారాణి పాతూరు చెన్నకేశవస్వామి ఆలయానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సుబ్రమణ్యం, తిమ్మారెడ్డి, చంద్ర ,మాజీ ఆలయ చైర్మన్ జీజీ వేణు, నాగేంద్రరావు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

అభివృద్ధి చేసేది చెప్పాం..నిరూపించాం

- 'అనంత'లో రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, చిత్రంలో మేయర్ వసీం , నాయకులు

అనంతపురం క్రైం: మాది మాటల ప్రభుత్వం కాదని..చేతల ప్రభుత్వమని..అనంతలో అభివృద్ధి చేసేది చెప్పాం.. అభివృద్ధి చేసి నిరూపించుకున్నాం అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఇబ్బంది పడినా.. మిగతా రెండున్నరేళ్లలో రూ.600 కోట్లతో రోడ్లు, కాలువ ఏర్పాటు చేశామని అన్నారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా నగర రూపురేఖలు మార్చామని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేసిన రూ.25 కోట్ల అభివృద్ధి పనులను మరో ఐదారు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. శుక్రవారం నగరంలోని 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో రూ.25 కోట్ల అభివృద్ధి పనులకు ఎంపీ తలారి రంగయ్య, మేయర్ వసీంతో కలసి ఎమ్మెల్యే 'అనంత' శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అదే డివిజన్‌లో రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ల పూర్తవుతుందన్నారు.
కేవలం రెండున్నరేళ్లలోనే నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను జరిగాయన్నారు. అన్ని డివిజన్లలో నగరపాలక సంస్థ సాధారణ, 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు , కాలువలు, తదితర అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. రూ.312 కోట్లతో బళ్లారి బైపాస్ నుంచి క్లాక్‌టవర్, సప్తగిరి మీదుగా పంగల్ రోడ్డు వరకు 9.1 కిలో మీటర్ల మేర జాతీయ రోడ్డు విస్తరణ, క్లాక్ టవర్ బ్రిడ్జ్ పనులు త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజాప్రతినిధుల కలహాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిస్తే..వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాము అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచామన్నారు. టీడీపీ ప్రభుత్వంకంటే ముందు అప్పటి పాలకుల హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను మాత్రమే 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రారంభించి, ఆ పనులను సకాలంలో పూర్తి చేయకలేకపోయిందన్నారు.

టీడీపీ సెల్ఫీ డ్రామాలు:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చెప్పలేక ప్రజల్లో భ్రమ కల్పించేందుకు టీడీపీ నాయకులు సెల్ఫీ డ్రామాలకు తెరలేపారని ఎమ్మెల్యే అన్నారు. జగనన్న కాలనీల పేరిట నియోజకవర్గంలో 23 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఇప్పటికే ఇళ్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో 2018 ఆగస్టులో టీడీపీ నాయకులు టిడ్కో ఇళ్ల పేరిట డిపాజిట్లు సేకరించి నిర్మాణాలకు శంకుస్థాపన చేసి, 10 శాతం పనులు పూర్తి చేయలేక పోయారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి నిర్మాణ పనులు 85 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలో ప్రజలకు ఇళ్లను అందించే తరుణంలో వారి ప్రభుత్వంలో చేసినట్లు సెల్ఫీలు తీసుకుని డ్రామాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ ప్రధాన రోడ్లకు రూ.600 కోట్లతో పనులు జరగడం చిన్న విషయం కాదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ వర్గపోరుతో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు చింతకుంట సుశీలమ్మ, కమల్‌భూషణ్, ఇస్సాక్, రహంతుల్లా, శ్రీనివాసులు, కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ సతీష్‌చంద్ర, ఈఈ రామమోహన్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, నాయకులు చింతకుంటమధు, నిహార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరందించడమే లక్ష్యం

రాప్తాడు: గ్రామాల్లోని ప్రతి ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యం ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రైజెస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో 15 మంది సభ్యులతో గ్రామీణ తాగునీరు, పారిశుధ్య కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి పంపులు, పారిశుధ్య నిర్వహణ కోసం వీడబ్ల్యూఎస్సీ బ్యాంకు ఖాతాలను తెరవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, రైజెష్ ఎన్జీఓ కోఆర్డినేటర్ షర్మిల, ఐఈసీ ఎక్స్‌పర్ట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

అనంతపురం రూరల్: రంజాన్ పండగను పురస్కరించుకొని ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షురాలు రుద్రంపేట ఎంపీటీసీ-4 సభ్యురాలు మహబూబీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధిక్‌వలి ఆధ్వర్యంలో చంద్రబాబునగర్‌లో ముస్లింమహిళలకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధిక్‌వలి మాట్లాడుతూ దానధర్మాలకు ప్రతీక రంజాన్ పండగ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, ఖాజా, అక్కమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండుగ సంబరంగా జరుపుకోవాలి



రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: ప్రతి ముస్లిం కుటుంబం రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లోని ముస్లింలు, దూదేకుల కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సరుకుల ప్యాకింగ్ చేశారు. అనంతపురం రూరల్ మండల ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా తోఫా అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్లు బండి పవన్, దుగుమర్రి గోవిందరెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథరెడ్డి, మండల కన్వీనర్ మతం శ్యాంసుందర్, నాయకులు ధనుంజయయాదవ్, ఈశ్వరయ్య, మాదన్న, యూత్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వా ర్డు మెంబర్లు, స్టోర్ డీలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

రాప్తాడు: పవిత్ర రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని 700 మంది ముస్లింలకు రంజాన్ తోఫా అందించారు. గ్రామ సచివాలయ అధ్యక్షుడు చిరుతల నాగేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే జయన్న, కపాడం ఈశ్వరయ్య, శ్రీనివాసులు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

అల్లా దీవెనలతో అందరూ బాగుండాలి

ఆత్మకూరు: అల్లా దీవెనలతో అందరూ సంతోషంగా ఉండాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరుకున్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పర్యటించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ముస్లిం పెద్దలతో కలిసి స్థానిక మసీద్‌లో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు తోఫా అందించారు. పేద ముస్లింలు పండుగ పూట సంతోషంగా జరుపుకోవాలని నియోజక వర్గంలోని 7000 కుటుంబాలకు రంజాన్ తోఫా అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి , జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ,నాయకులు

అభివృద్ధి పనులకు భూమి పూజ: మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. స్థానికంగా ఉన్న ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం, కనకదాసు కల్యాణ మండపంలో ఫ్లోరింగ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి,ముస్లిం మత పెద్దలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం

కనగానపల్లి: గ్రామాల్లో అవసరమైన ప్రతిచోటా నీటి శుద్ధి జలకేంద్రాలు ఏర్పాటు చేయించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని భానుకోట గ్రామంలో ఆయన నీటి శుద్ధి జలకేంద్రాన్ని ప్రారంభించారు. రెన్యూ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని స్థానిక బస్టాండ్ కూడలి పక్కన ఏర్పాటు చేశారు.

మహిళల ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 35వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల కమ్యూనిటీ హాల్‌ను ఎంపీ రంగయ్య, మేయర్ వసీంతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జేసీఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ కొండ్రెడ్డి రాధ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడారు. తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రూ.2 లక్షల కోట్లను లబ్ధిదారులకు అందించామన్నారు. టీడీపీ హయాంలో రూ.3 లక్షల కోట్లు అప్పు చేశారని, ఆ డబ్బులన్నీ ఎక్కడకు వెళ్లాయని ప్రశ్నించారు. పేద ప్రజలకు మంచి చేయడం టీడీపీకి ఇష్టం లేదన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు మహిళలను మోసం చేశారన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక నాలుగు విడతల్లో రుణాలు మాఫీ చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ డివిజన్‌లో నాలుగు నెలల్లోనే కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేశామన్నారు.



మారుతీనగర్‌లో గడప గడపకూ నిధులతో నిర్మించిన స్వయం సహాయక సంఘాల భవనం

టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల దోపిడీ :

ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించి వారు ఆర్థిక ప్రగతి సాధించేందుకు కృషి చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దోపిడీ చేశాయన్నారు. వైఎస్సార్ సీపీలో అలాంటి పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాల కోసం నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, తమ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందిస్తున్న తీరును వివరించారు. మేయర్ వసీం మాట్లాడుతూ మహిళా సాధికారత వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలు తెలిపారు. జేసీఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి 35వ డివిజన్‌లో రూ.6.5 కోట్లతో జరిగిన అభివృద్ధిని వివరించారు. కమిషనర్ రమణారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, నాల్గో పట్టణ సీఐ జాకీర్ హుస్సేన్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు శ్రీదేవి, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి, కార్పొరేటర్లు ఇస్సాక్, సంపంగి రామాంజనేయులు, నాయకులు నిహార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్వయం సహాయక సంఘాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంగయ్య , ఎమ్మెల్యే అనంత

యువతి అదృశ్యం



షభాన

అనంతపురం: అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఆకుతోటపల్లికి చెందిన కాకర్ల షభాన (19) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. గత నెల 14 నుంచి ఆమె జాడ కనిపించలేదు. ఎవరికైనా అచూకీ తెలిస్తే సెల్: 9491067738, 9440796807లో సమాచారం ఇవ్వాలని ఇటుకలపల్లి ఎస్ఐ శ్రీకాంత్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు.

'యువ ఉత్సవ్'కు ఆహ్వానం

అనంతపురం కల్చరల్: యువత ప్రతిభా పాటవాలు చాటేలా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జూన్‌లో యువ ఉత్సవ్ పేరిట ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎన్వైకే అధికారి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. కల్చరల్ ఫెస్టివల్ గ్రూప్ ఈవెంట్, ఉపన్యాస పోటీ, యువ రచయిత, యువ కళాకారులు, ఫొటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహించి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9849871174 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మోదీ హటావో...దేశ్‌కీ బచావో

రాప్తాడురూరల్: మోదీ హటావో.. దేశ్‌కీ బచావో అని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందంటూ నిరసిస్తూ శుక్రవారం అనంతపురం రూరల్ మండలంలో ప్రచారజాతా నిర్వహించారు. కాటిగానికాలవ, చిన్నంపల్లి, సజ్జలకాలవ, పాత కురుగుంట, వైఎస్సార్‌కాలనీ, ఐజీ నగర్, అక్కంపల్లి గ్రామాల్లో పర్యటించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న ప్రారంభమైన జాతా 30 వరకు కొనసాగుతుందన్నారు. సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, మండల కార్యదర్శి రమేష్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు చలపతి, వెంకటనారాయణ, నాయకులు రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి



లేఔట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

రాప్తాడురూరల్: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. అనంతపురం రూరల్ మండలంలోని ఆలమూరు, కొడిమి జగనన్నకాలనీ (లేఔట్లు)లను కలెక్టర్ గౌతమి శుక్రవారం పరిశీలించారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మే నెలలో నిర్వహించనున్న మెగా గృహ ప్రవేశానికి ఆలమూరు లేఔట్‌లో ఆర్సీ లెవెల్‌కు చేరుకున్న 406 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కూలీలను ఎక్కువగా సమీకరించి అనుకున్న సమయానికి లేఔట్‌ను సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కొడిమి లేఔట్‌లో బేస్ మెంట్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను త్వరగా ఆర్సీ లెవెల్‌కు తీసుకురావాలని సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఎడీ కేశవనాయుడు, ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్, హౌసింగ్ ఈఈ సత్యనారాయణ, డీఈ కృష్ణారావు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు తరలిరండి

అనంతపురం కల్చరల్: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వర కోదండరామాలయ శతాబ్ది ఉత్సవాలకు పీఠాధిపతులు, మంత్రులు, అధికారులు రానున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ చరిత్ర పుస్తకాలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రమణ్యం, మాజీ ఈవో నాగేంద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యులు తిమ్మారెడ్డి, వెంకటస్వామి, ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి మాట్లాడారు. ఈనెల 23 నుంచి 26 వరకు ఆలయం వేదికగా శతాబ్ది ఉత్సవాలు జరుగుతాయన్నారు. ముగింపు వేడుకలకు ఎండోమెంట్ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎండోమెంట్ ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వేదపండితులు సత్యనారాయణ, కిశోర్, హర్షశర్మ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జుమ్మతుల్ విదా



ప్రార్థనల్లో పాల్గొన్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వ్యాప్తంగా రంజాన్ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసం మరో ఏడాది వరకు వేచి చూడాల్సి ఉంటుందని, రంజాన్ మాసం బహుమానాలు, వారి ప్రత్యేక దువాలను ఇప్పుడే పూర్తి చేసుకోవాలని మసీదుల్లో మౌలానాలు తమ ప్రసంగాల ద్వారా తెలియజేశారు.

ప్రార్థనల్లో పాల్గొన్న మేయర్: నగరంలోని రాణీనగర్‌లో ఉన్న ఇస్మాయిల్ మసీదులో నగర మేయర్ వసీం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాత్రి జాగరణలో ఆయన పాల్గొన్నారు. మసీదు వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక దువాను ఆచరించారు.

నెలవంక వీక్షణ: రంజాన్ మాసం ముగింపు, షవ్వాల్ మాసం ప్రారంభోత్సవం సందర్భంగా ఆనవాయితీ ప్రకారం శుక్రవారం సాయంత్రం ఆయా మసీదుల్లో ప్రత్యేకంగా నెలవంకను వీక్షించారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో ఆయా మసీదుల్లో నెలవంకను వీక్షించారు. ఆ తరువాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ముసాఫా అందించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట



బంగారు పతకాలు సాధించిన మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల విద్యార్థులు


రాప్తాడు: అత్యున్నత ప్రమాణాలతో మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల బంగారు బాట వేస్తోందని ఎండీ కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీరా పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి ఎలీట్ పాఠశాలలో ఇంటెస్సో సామర్థ్య పరీక్ష నిర్వహించారు. అందులో 500 మంది విద్యార్థులు పాల్గొనగా, 205 మంది విద్యార్థులు రెండో దశకు ఎన్నికయ్యారు. వీరిలో 57 మంది విద్యార్థులు బంగారు పతకాలకు ఎంపికయ్యారు. ఎండీ కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీరా 57 మంది విద్యార్థులకు బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

అనంతపురం కల్చరల్: నగరంలోని సీఎస్ఐ ప్రార్థనా మందిరం ప్రథమ వార్షికోత్సవం శనివారం జరుపుతున్నారు. అరవిందనగర్‌లో సీఎస్ఐ చర్చిని సుందరంగా ముస్తాబు చేశారు. శనివారం సాయంత్రం చర్చిలో జరిగే వేడుకలకు బిషప్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్ వైఎస్సార్ కడప జిల్లా నుంచి ముఖ్య అతిథిగా రానున్నారు. వాక్యపరిచర్య, సామూహిక ప్రార్థనలు, కోయర్ బృందాల భక్తిగీతాలాపనల నడుమ వేడుకలు జరుగుతాయని పాస్టర్ రెవరెండ్ బెనహర్‌బాబు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు

రాప్తాడు: సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఐటీ అర్బన్ ప్రో కంపెనీ రీసోర్స్ పర్సన్ ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో జాంగో ఫ్రేం వర్క్ విత్ పైథాన్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఐటీ అర్బన్ ప్రో కంపెనీ రీసోర్స్ పర్సన్ ఐశ్వర్య లక్ష్మీ మాట్లాడుతూ దేశం ముందుకు వెళ్తున్న నేపథ్యంలో విద్యార్థులు సామాన్యులకు ఉపయోగపడే పరిశోధనలు చేయాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించే వర్క్‌షాపులో ప్రతి విద్యార్థి పాల్గొని వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, సీఎస్ఈ విభాగపతి విజయ భాస్కర్, కళాశాల కోఆర్డినేటర్ రంగాస్వామి, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ

ఉచిత కంటి పొర శిబిరానికి స్పందన

రాప్తాడు: బొమ్మేపర్తి గ్రామంలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో చెన్నై శంకర నేత్రాలయ ఆస్పటల్ వైద్యులు అరుర్, రంజిత్ సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి పొర శిబిరానికి స్పందన లభించింది. దాదాపుగా 238 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 15 మందికి కంటి సమస్యలు ఉండడంతో వారిని ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. అపెక్స్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత బోయ తిరుపాల్, ఆశ్రమ కార్యనిర్వాహకులు నవీన్ దత్త, అమర సింహ దత్త, వేణుగోపాల్ రెడ్డి, శోభారాణి, వెంకటనాయుడు పాల్గొన్నారు.

రేపు శిల్పారామంలో రంజాన్ వేడుకలు

అనంతపురం రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: పవిత్ర రంజాన్ పండుగకు సంబంధించి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు ఉండి అల్లా దయ, కరుణను సాధించుకున్నారని, పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలని ఆయన తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 23	59,655	
నిఫ్టీ 0	17,624	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	12,077	▲ 20
డోజోన్స్	33,876	▲ 8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲ 12
డాక్స్	15,882	▲ 86
షాంఘై	3,301	▼ 2
నికాయ్	28,564	▲ 93

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	60,191	▼ 425
బంగారం (22 క్యారెట్)	59,950	▼ 423
వెండి (కిలో)	74,773	▼ 646

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్ అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	418-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365-00
విజయవాడ	365-00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358-00
వరంగల్	360-00
రిటైల్ ధర	4.20

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం



ఆర్థిక వృద్ధిలో భాగం

డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్‌డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ-డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

–ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021-22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్‌ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్‌ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్‌ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021-22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021-22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సంపదలో 6 శాతం పుత్తడికి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా-హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018-19 నుంచి 2022-23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.

హింద్ జింక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

HINDUSTAN ZINC
Zinc of India

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 - 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

సాక్షి స్పోర్ట్స్



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్‌ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్‌లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

PARIS 2024

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ



జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ-ఓజస్ రెండో రౌండ్‌లో 159-157తో మరియా-గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159-156తో సోఫీ-అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157-155తో ఫాతిన్ నూర్‌ఫతే-జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ-ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్-భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లో 3-5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



ధీరజ్ అద్భుతం...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6-0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6-4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్‌లో 6-4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6-5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్‌పై, క్వార్టర్ ఫైనల్లో 6-4తో తరుణ్‌దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఇలిసన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్-2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ



బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే



కాన్వే



జడేజా

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ కళ్లెం వేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్‌రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్‌రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే అదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్‌రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134. వికెట్ల పతనం: 1-35, 2-71, 3-84, 4-90, 5-95, 6-116, 7-134. బౌలింగ్: ఆకాశ్ 3-0-17-1, తుషార్ దేశ్‌పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్‌రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138. వికెట్ల పతనం: 1-87, 2-110, 3-122. బౌలింగ్: భువనేశ్వర్ 2-0-10-0, జాన్సెన్ 3-0-37-0, మార్క్‌రమ్ 1-0-11-0, సుందర్ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్ 3-0-18-0, డాగర్ 3-0-21-0.

సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్‌వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్‌లను తొలగించింది. ఈ మార్క్‌లు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్' మార్క్‌లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్‌లు కేటాయించాలని ట్విటర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ ఛెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?



సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తెలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్‌కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.